

విద్యార్థులకు స్వీట్ తినిపిస్తున్న ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకుడు యాదగిరి

## సప్లిమెంటరీలో పాస్ కావాలి

### ఇంటర్ విద్య రాష్ట్ర పరిశీలకుడు యాదగిరి

తొర్రూరు, మే2 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింగిల్, డబుల్, త్రిపుల్ సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివి సప్లిమెంటరీ పరీక్షలో పాస్ అయ్యేలా చూడాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్య రాష్ట్ర పరిశీలకుడు టీ యాదగిరి కోరారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక నిర్వహిస్తున్న తరగతులను శుక్రవారం డీఐవో మాధర్‌గౌడ్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం కళాశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బీ నారాయణ, అధ్యాపకులు సువర్ణ, ఉప్పలయ్య, అన్నపూర్ణ, నర్సయ్య, మల్లయ్య, శివరామకృష్ణ, అనిత, రాజేశ్, నాగరాజ్, కమల్దీప్ పాల్గొన్నారు.




మన్నెగూడెంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ అశోక్

## అవయవ దానం అత్యున్నతమైనది..

డోర్నకల్, మే 2 : అవయవ దానం అత్యున్నతమైన దానమని నేత్ర, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శుక్రవారం మన్నెగూడెం జడ్పీహెచ్ఎస్‌లో అవయవ దానం కర పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. అవయవ దానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర ప్రతినిధి సహజ, డాక్టర్ ఆడేపు రాజేంద్రప్రసాద్, నాగేశ్వరావు, శ్రావణ్, లక్ష్మణ్ అర్జున్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## పలువురి కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

తొర్రూరు, మే 2 : తొర్రూరు మండల కేంద్రంలోని కవిత హోటల్ వెంకన్న అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన గుర్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త పెంట కొమురయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.



మరిపెడ: ధాన్యం రాసి చుట్టూ వర్షం నీరు చేరడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతు కొమరయ్య




గార్ల: గాలి దుమారానికి కూలిపోయిన వల్లపుదాసు రామకృష్ణ ఇల్లు

# అకాల వర్షం.. ఆగమాగం

- అన్నదాతలపై ప్రకృతి కన్నెర్ర
- గాలివానలతో పంటలు దెబ్బ తింటున్న పంటలు
- మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం, మిర్చి
- రాలిన మామిడి కాయలు
- ధాన్యం కాంటాలు, తరలింపు ఆలస్యం.. రైతులకు శాపం
- ఎగిరిపోయిన ఇండ్ల పై కప్పలు, కూలిన చెట్లు, కరెంటు స్తంభాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అన్నదాతలపై ప్రకృతి కన్నెర్ర చేస్తున్నది. బలమైన ఈదురు గాలులు, వర్షాలు ఆగమాగం చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కండ్ల ముందే వరద నీటిలో కొట్టుకుపోతుండడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. వాటిని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యం కాంటాలు, తరలింపు ఆలస్యం కావడంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో వేచిచూడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. సరైన సమయంలో కాంటాలు పెడి తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని ఆవేదన చెందుతున్నారు. ఈదురుగాలులకు చెట్లు కూలిపోగా, పలువురి ఇండ్ల పై కప్పులు ఎగిరిపోయాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. మహబూబాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, షెడ్‌లలో వేసి మిర్చి బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి. కురవి, సీరోలు మండలాల్లో వరి, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి కురవి మండలంలో 70కి పైగా కరెంట్ స్తంభాలు కూలిపోయాయి. దీనికి తోడు పలువురి ఇంటి పైకప్పులు లేచిపోవడంతో వారంతా రాత్రి బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీశారు. రహదారిపై పలు చోట్ల భారీ వృక్షాలు నేలకూలి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. సీరోలు ఎస్సై నగేశ్ ఆధ్వర్యంలో పోలీసులు జేసీబీలతో వాటిని తొలగించడంతో ఉదయం 9గంటలకు రాకపోకలు యథావిధిగా నడిచాయి. డోర్నకల్ మండలం బంజర, డోర్నకల్, చిల్కోడు, పెరుమాండ్ల సంకీస గ్రామాల్లోను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. ముల్కలపల్లి గ్రామ వద్ద మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. చిల్కోడు, చాప్ల తండా వద్ద బొప్పాయి తోట నేలకొరిగి కాయలు రాలిపోయాయి. గూ డూరు మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. టార్పాలిన్లు కప్పినా ఫలితం లేకుండా పోయింది. వరద నీటిలో వడ్లు కొట్టుకుపోయాయి. మరిపెడ మండలం వీరారం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు కన్నీరు పెట్టుకున్నారు. లారీలు, హమాలీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధాన్యపు రాశులు పేరుకుపోతున్నాయన్నారు. బయ్యారం మండలంలో ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. రెండు గంటల పాటు ఈదురు గాలులతో రాళ్ల వాన కురిసింది. కొత్తపేట, బయ్యారం, బాలాజీపేట, వెంకట్రాంపురం, జగ్గుతండా, బంజర తండా, నామలపాడు, నర్సాతండా ఉప్పలపాడు, మిర్యాల పెంట కంబాలపల్లి, కాచనపల్లి వంటి గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. ఇల్లందు– మహబూబాబాద్ జాతీయ రహదారి 930పీ బయ్యారం శివారులోని చెట్టు పడిపోవడంతో గంటపాటు భద్రాచలం– వరంగల్‌కు రాకపోకలకు అంతరాయం కలిగింది. కొత్తపేట, ఉప్పలపాడు, బయ్యా రం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. రంగాపురం ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న 150 ఏళ్ల మర్రివృక్షం వేర్లతో సహా కూలిపోయింది. 50 కరెంటు స్తంభాలు కూలిపోగా విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు.12 ఇండ్లు కూ లినట్లు అధికారులు గుర్తించారు. గార్ల మండలంలోని అకాల వర్షం, గాలి దుమా రం అన్నదాతలకు నష్టం కలిగించాయి.



కూలిన బయ్యారం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న 150 ఏళ్ల మర్రిచెట్టు.



మహబూబాబాద్‌లో లేచిపడిన రేకుల షెడ్



కురవి: హరియా తండాలో కూలిన కరెంట్ స్తంభాలు



బయ్యారం: ఇల్లందు– మహబూబాబాద్ జాతీయ రహదారిపై కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది



డోర్నకల్: ముల్కలపల్లి వద్ద విరిగి పడిన విద్యుత్ స్తంభం

## ఖోఖో శిక్షణ శిబిరం ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేసవి ఖోఖో శిక్షణ శిబిరాన్ని జిల్లా క్రీడల అధికారి జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వేసవి శిక్షణ క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయకుండా క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారులు లింగారెడ్డి, ఇస్మాయిల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, వెంకన్న, అంజయ్య, సోమనర్సయ్య, వినయ్, కృష్ణ పాల్గొన్నారు.

## అవసరం మేరకే ఎరువులు వాడాలి

మహబూబాబాద్ రూరల్: పంటల సాగులో అవసరం మేరకు రసాయన ఎరువులు వాడాలని మల్యాల కేవీకే సమన్వయ కర్త మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి జూన్ 13 వరకు ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లు, వ్యవసాయ ఖర్చులు తగ్గింపుతోపాటు పలు అంశాలపై అవగాహన సదస్సులు ఉంటాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రెవెన్యూ సదస్సులను నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్ : భూ బారతి చట్టంలో భాగంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్‌లను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణరావుతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 20 వరకు పైలట్ ప్రాజెక్ట్ జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలో ఒక మండలాన్ని పైలట్‌గా తీసుకొని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవాలన్నారు. భూభారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం అవసరమైన కార్యచరణ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి, ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

## నీటి సరఫరాకు నేడు అంతరాయం

మహబూబాబాద్ రూరల్ : నందన గార్డెన్ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ పంపు నుంచి నీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ లీకేజీ కారణంగా కొత్తబజార్ ఏరియాకు నేడు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ డీడీ ఉపేందర్ శుక్రవారం తెలిపారు. త్వరిత గతిన మరమ్మతు చేసి భగీరథ నీటిని అందిస్తామని పేర్కొన్నారు.

## పరిహారం చెల్లించాలి

డోర్నకల్: అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యానికి పరిహారం చెల్లించాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని బంజర, డోర్నకల్, చిల్కోడు, పెరుమాండ్ల సంకీస గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, చాప్లతండా, చిల్కోడు గ్రామాల్లో నేలకొరిగిన బొప్పాయి తోటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఉప్పెనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... అకాల వర్షం, గాలి దుమారంతో బొప్పాయి, మామిడి, ధాన్యం రైతులకు నష్టం కలిగిందని, ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు.కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి శెట్టి వెంకన్న, బొమ్మన అశోక్, మల్లేశం, బొబ్బ వెంకట్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

డోర్నకల్ : జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ముల్కలపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. ముల్కలపల్లి గ్రామానికి చెందిన షేక్ రషీద్ (24) పెయిటింగ్ వర్కర్. వారం రోజులుగా దిగులుతో ఉంటున్నారు. ఈ నెల ఒకటిన పొలం వద్ద గడ్డి మందు తాగి తన రెండో అన్న ఇస్మాయిల్‌కు ఫోన్‌చేసి జీవితంపై విరక్తితో గడ్డిమందు తాగినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ఏరియా వైద్యశాలకు తరలించగా, శుక్రవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి చిన్న సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డోర్నకల్, మే 2 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు రైల్వేస్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఆర్పీఎఫ్ ఎస్సై నాగరాజు కథనం ప్రకారం... సిగ్నల్ తండా వద్ద రైల్వే కాంట్రాక్టర్ పనుల నిమిత్తం ఇసుక డంపు చేశాడు. డంపు చేసిన ఇసుకను కొందరు అక్రమంగా తరలిస్తున్నారని కాంట్రాక్టర్ ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రైల్వేస్టేషన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపాడు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ఉచిత కంప్యూటర్ శిక్షణ**
★ఉచిత కంప్యూటర్ శిక్షణ (Tally, PGDCA) విద్యార్థి కంప్యూటర్స్, డాల్ఫిన్ హోటల్ గల్లీ, వరంగల్ చౌరస్తా, వరంగల్. T&C Apply.
NTW-6585

**PLOT FOR SALE**
★యాదాద్రికి సమీపంలో RRRకి దగ్గరలో మోత్కూర్ రోడ్ చీమలకొండూరు గ్రామంలో ఫార్మ్‌ల్యాండ్‌లో ప్లాట్స్ అమ్మబడును. Sq.yd.: 3,999/- మాత్రమే. వివరాలకు: 7989747927.
NT-330890

**CHANGE OF NAME**
★I, BOINI RAVINDAR, S/o. Malla Reddy Boini, R/o. 2-1-539/E, Adharsha Colony, Road No. 09, Hanamkonda, TS-506 001. Changed My Name as BOINI RAVINDER REDDY, S/o. Malla Reddy Boini.
NT-342903

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

నెల్లికుదురు, మే 2 : పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీ విజయ్, శిరీష, వీరియాను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాందాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**నర్సింహులపేటలో..**

నర్సింహులపే : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను శుక్రవారం ఎంఈవో రామ్మోహన్‌రావు సన్మానించారు. 15మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని, టాపర్ దూరు ఆనంద్ 548 మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఆనం ద్, కల్యాణికి పీడీ శంకర్ రూ.500 చొప్పున అందజేశారు.

**చిన్నగూడూరులో..**

చిన్నగూడూరు: పది ఫలితాల్లో 571మార్కులతో మండల టాపర్‌గా నిలిచి గాడిపల్లి వరుణ్‌సందేశ్‌ను శుక్రవారం ఎంఈవో రవి కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీశ్‌రెడ్డి, వెంకన్న, స్థానికులు గాడిపల్లి రవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

**మరిపెడలో..**

మరిపెడ : పది ఫలితాల్లో తెలుగు మీడియం విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు. వీరారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన జీ శ్రీకాంత్‌కు 525 మార్కులు, ఎం నవీన్‌బాబు 502 మార్కులు సాధించగా, పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రామగిరి మధు, ఉపాధ్యాయులు వెంకట్, అనిల్, వెంకన్న పాల్గొన్నారు.

## ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు

కేసముద్రం : మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో శుక్రవారం తూనికలు, కొలతల అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ త్రాసు, బాట్లను పరిశీలించారు. తూకాల్లో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పేరు ఒకరిది..ఊరు మరొకరిది..

- మినీ ట్యాంక్ బండ్‌కు నిధులు తెచ్చింది మాజీ మంత్రి ఎర్రబెల్లి
- వివరాలు వెల్లడించని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి
- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బిందుశ్రీనివాస్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తొర్రూరు, మే 2 : మినీట్యాంక్ బండ్‌కు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3.60 కోట్లు మంజూరు చేసిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బిందుశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తొర్రూరు పట్టణంలోని పెద్దచెరువు ట్యాంక్ బండ్ పనులు తాజాగా ప్రారంభమైనా, నిధులు మాత్రం గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మంజూరయ్యాయని అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి కేటీఆర్ కలిసి రూ.25 కోట్లు టీఈయూఎఫ్ ఐడీ నిధులు తీసుకొచ్చారని, వాటిలో రూ.3.50కోట్లు ట్యాంక్ బండ్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేటాయించారని తెలిపారు. అయినా, ప్రస్తుత ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు కలిసి కట్ట మైసమ్మకు పూజలు చేసి ఈ పనులను కొత్తగా ప్రారంభించినట్లు తెలిపారు. అయితే నిధులు ఎప్పుడు మంజూరయ్యాయనే విషయాలు వెల్లడించలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బిందుశ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, నాయకులు కర్నే నాగరాజు, ఉప్పలయ్య, కుమారస్వామి, రవి, రావిశెట్టి వెంకన్న, జంపా, శంకర్, గుంజి రవి, మోటు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

కురవి, మే 2 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా త్వరగా ధాన్యాన్ని తరలించాలని నిర్వాహకులను మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని అయ్యగారిపల్లి, కురవి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిన రైతులను పరామర్శించారు. కురవి సెంటర్‌లో గన్నీ బస్తాల కొరత, హమాలీల కొరత, రవాణా ఆలస్యమవుతున్నందున అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించాలన్నారు. తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి గన్నీ బస్తాలు త్వరగా అందేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేశ్, బుర్ర సమ్మయ్య, నర్సింగం గురువయ్య, ఏపీవో సత్యనారాయణ, శరత్, జితేందర్, రైతులు బాదె నాగయ్య, కానుగంటి రవి పాల్గొన్నారు.

**మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం**

కొత్తగూడ : పెగడపల్లి సమీపంలోని దుర్గారం గ్రామానికి చెందిన జంగ సంపత్, ఎల్లయ్య కుమార్తెలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. శుక్రవారం బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడె నాగజ్యోతి ఆదేశాల మేరకు కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు రూ. 53వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతురాలి కుటుంబానికి సాయం అందిసున్న నాయకులు

## ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత సౌకర్యాలు

నెల్లికుదురు, మే 2 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాలు ఉంటాయని మండల విద్యాశాఖ అధికారి రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల క్లాత్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు యూనిఫాం కోసం క్లాత్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల ఎంఐఎస్ కో ఆర్డినేటర్ సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉపేందర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల కబ్జాపై విచారణ చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 2 : భూదాన్ భూముల కబ్జాపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అనేక ఏరియాల్లో ఉన్న భూదాన్ భూములను కాజేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అనేకచోట్ల భూదాన్ భూముల్లో కొందరు బడా నాయకుల అండదండలతో అక్రమంగా వెంచర్లు చేసి అమ్ముతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అదికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బానోత్ రాందాస్, మంగీలాల్, శ్రీను, బాలూనాయక్, వీరన్న, సిద్దార్థనాయక్ పాల్గొన్నారు.

## జాగ్రత్తతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

తొర్రూరు మే 2 : మే ఒకటి నుంచి 7 వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ తొర్రూరు డివిజనల్ ఇంజినీర్ మధుసూదన్ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం నాంచారిమడూరు గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో టెక్నికల్ డివిజనల్ ఇంజినీర్, సేఫ్టీ ఆఫీసర్ పెద్దిరాజం పాల్గొని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ సీఎస్ చలపతిరావు, చిన్నవంగర, తొర్రూరు అసిస్టెంట్ ఇంజినీర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడు చెరువులో శవమై..

గూడూరు మే 2 : తప్పిపోయిన బాలుడు చెరువులో శవమై తేలిన ఘటన గూడూరు మండలంలోని భూపతిపేట గ్రామంలో జరిగింది. ఎస్సై గిరిధర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని చిన్నఎల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధి లక్ష్మణ్‌తండాకు చెందిన వాంకుడోత్ సునీత–కృష్ణమూర్తి దంపతులకు కొడుకు జాన్‌పాల్ ( 6) కుటుంబ సభ్యులతో కలిసి పక్కనే ఉన్న సీతానగరం గ్రామపంచాయతీ పరిధి ఆదివారం పేట తండాకు శుభకార్యం నిమిత్తం మూడు రోజుల క్రితం వెళ్లాడు. బుధవారం రోజు రాత్రి తన తండ్రితో కలిసి ఆటోలో ఇంటికి వస్తుండగా నిద్ర రావడంతో గ్రామ సమీపంలోని ఓ కల్వర్టు వద్ద ఆటో ఆపి అందులో తన కొడుకుతో కలిసి నిద్రించాడు. గురువారం ఉదయం కృష్ణమూర్తి లేచి చూసేసరికి ఆటోలో జాన్‌పాల్ కనిపించలేదు. కంగారుతో తండ్రి పరిసర ప్రాంతాల్లో, తండాలో, బంధువుల ఇండ్లలో వెతికినా బాలుడి ఆచూకీ దొరుకలేదు. వెంటనే కృష్ణమూర్తి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

**చెరువులో శవమై తేలిన బాలుడు**

తప్పిపోయిన బాలుడు శుక్రవారం ఉదయం భూపతిపేట గ్రామంలోని రాళ్లచెరువులో శవమై తేలాడు. బాలుడు ఆటోలో నుంచి కనిపించకుండా పోయిన ప్రాంతానికి కొద్ది దూరంలో ఉన్న చెరువులో బాలుడు శవమైతేలాడు. పోలీసులు వెళ్లి బాలుడి మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసుకువచ్చారు. కృష్ణమూర్తి తెలిపిన వివరాలు.., బాలుడి వివరాలు ఒకేలా ఉండడంతో వారు కృష్ణమూర్తికి సమాచారం ఇచ్చారు. కాగా బాలుడి శరీరంపై కొన్ని గాయాలు ఉన్నట్లు సమాచారం. బాలుడిని ఎవరైనా కొట్టి చెరువులో పడేశారా..?, అనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. జాన్‌పాల్ మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చెరువులో పడి ఒకరి మృతి

మహబూబాబాద్ రూరల్ : చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల శివారులో శుక్రవారం జరిగింది. రూరల్ ఎస్సై దీపికా రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని భవానీనగర్ తండాకు చెందిన జాటోత్ భాస్కర్ (35) పట్టణంలో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం మే డే వేడుకల్లో పాల్గొని తన స్నేహితులతో కలిసి మండల శివారులోని కంబాలపల్లి పెద్ద చెరువులోకి ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ లోతుకు వెళ్లి ఊపిరి ఆడక మృతి చెందాడు. అతడి తమ్ముడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భాస్కర్ భార్య గత సంవత్సరం మృతి చెందింది.

**అనాథలైన ముగ్గురు పిల్లలు**

నాడు తల్లి మృతి చెందగా, నేడు చెరువులో పడి తండ్రి మృతి చెందాడు. పట్టణంలోని భవానీనగర్ తండాకు చెందిన జాటోత్ భాస్కర్, కల్పన దంపతులు కూలీ పనులు చేసేవారు. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు. కల్పన పట్టణంలోని ఇండ్లలో పని చేస్తుండగా, భర్త భాస్కర్ అనుమానంతో గతేడాది కత్తితో పొడవడంతో మృతి చెందినది. అనంతరం భాస్కర్ పట్టణంలో కూలీ పనులు చేస్తున్నాడు. గురువారం మండలంలోని కంబాలపల్లి పెద్ద చెరువులోకి స్నేహితులతో ఈతకు వెళ్లి, చెరువులో మునిగి మృతిచెందాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు ఆడపిల్లలు అనాథలయ్యారు. పెద్ద అమ్మాయి స్వరూప పదో తరగతి, రెండో అమ్మాయి విచిత ఏడు, చిన్న అమ్మాయి వర్షిత ఐదో తరగతి చదువుతున్నారు. అనాథలై దిక్కుతోచని స్థితిలో ఉన్న ముగ్గురు ఆడ పిల్లలను దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.